సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 8 । జనవరి । 2024



బ్యాటింగ్ చేసి..
సింగరేణి సంస్థ 11 ఏరియాల్లోని అధికారులకు ఆదివారం కొత్తగూడెంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. 10లో



'సాక్షి' స్పెల్‌బీకి స్పందన
'సాక్షి' ఆధ్వర్యంలో కాజీపేటలో నిర్వహించిన స్పెల్ బీ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
30°/ 20°
జిల్లాలో సోమవారం ఉదయం వరకు చలి తీవ్రత ఉంటుంది. రాత్రి వేళ మంచు అధికంగా కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు రెండో రోజుకు చేరాయి. ఆదివారం గణపతిపూజ, పుణ్యావాచనం, చండీహోమం తదితర పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడి బియ్యం, గాజులు, పసుపు, కుంకుమ, చీరలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

కొత్తగూడెంఅర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులను అందజేయాలని కోరారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని, ప్రజావాణి తదుపరి గణతంత్ర వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశం ఉంటుందని, అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

నేటి నుంచి ఇగ్నైట్ ఫెస్ట్

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో నేటి నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఎతోస్ ఇగ్నైట్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఇగ్నైట్ ఫెస్ట్–23 పోటీలకు రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులు పాల్గొననున్నారు. పోటీల ప్రారంభోత్సవం, ముగింపు కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లను గిరిజన గురుకులం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

సింగరేణి కళాశాల లెక్చరర్‌కు డాక్టరేట్



చింతా శారద

కొత్తగూడెంఅర్బన్/ సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న చింతా శారదకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ గంగాధర్ పర్యవేక్షణలో 'సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ – కొత్తగూడెం ఏరియాలో చట్టపరంగా, స్వచ్ఛందంగా తీసుకుంటున్న భద్రతా ప్రమాణాలు–ఒక పరిశీలన' అనే అంశంపై పరిశోధనాత్మక గ్రంథం సమర్పించగా, డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా శారదను సింగరేణి ఎడ్యుకేషల్ సొసైటీ జీఎం ఎస్.వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ నికోలస్ తదితరులు అభినందించారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామి వార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

నేడు విశ్వరూప సేవ

దేవస్థానంలో రామయ్య స్వామికి సోమవారం విశ్వరూప సేవ జరగనుంది. ఈ సేవ భద్రాచల దివ్యక్షేత్రంలోనే జరగటం ఈ ఉత్సవం ప్రత్యేకత. వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం అనంతరం 16 రోజులకు ద్వాదశి రోజున ఆలయంలో ఈ క్రతువు నిర్వహిస్తారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలు, సర్వదేవతాలంకరణ చేసి ఆళ్వార్‌లతో కూడిన స్వామి వారిని బేడా మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేస్తారు.

ఈసారీ ఆలస్యమే..



కాచనపల్లిలో సాగుచేస్తున్న మొక్కజొన్న

ఇంకా పూర్తికాని వానాకాలం వరి కోతలు
- ఇప్పటివరకు యాసంగి సాగు 1,31,233 ఎకరాలే..
- ఊపందుకోని రబీ వరిపంట సాగు
- గత రెండేళ్లుగా ఆలస్యమవుతున్న వ్యవసాయ సీజన్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల రెండేళ్లుగా వ్యవసాయ సీజన్లు ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయి. దీంతో పంట దిగుబడులు కూడా ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో వానాకాలం పంటలకు సంబంధించి కొన్ని ప్రాంతాల్లో ఇంకా వరి కోతలు సాగుతున్నాయి. మరోవైపు కోతలు పూర్తయిన ప్రాంతాల్లో యాసంగి పంటలు సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన పంటలు ఆరిన తర్వాతే కోతలు జరుగుతున్నాయి. వ్యవసాయ సీజన్లు ఆలస్యం కావడం వల్లే పంటలు కూడా ఆలస్యంగా వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పటివరకు 61.77 శాతమే సాగు

సీజన్లు ఆలస్యం కావడంతో గత యాసంగి అంచనా విస్తీర్ణాన్నే కొనసాగిస్తున్నారు. గత యాసంగిలో 2,12,462 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కాగా 1,72,960 ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు వేశారు. దీంతో గత సీజన్‌లో 81.41 పంటల శాతం నమోదైంది. ఈ సీజన్‌లో కూడా ఇదే విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని సాధారణ అంచనా విస్తీర్ణాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 1,31,233 ఎకరాల్లో వివిధ పంటలను వేశారు. సాధారణ విస్తీర్ణంలో 61.77 శాతం పంటలు సాగు చేశారు. ప్రధానంగా వరి కోతలు ఇంకా కొనసాగుతుండగా, కేవలం 47 ఎకరాల్లోనే ఇప్పటివరకు యాసంగి వరి సాగు చేపట్టారు. మొక్కజొన్న, మిర్చి ఆశించిన స్థాయిలో వేయగా ఆయిల్‌పామ్ అనుకున్న లక్ష్యం కంటే అధికంగానే వేశారు.

వాతావరణ మార్పుల వల్ల..



వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వ్యవసాయ సీజన్లు ఆలస్యమవుతున్నాయి. వాతావరణ మార్పులకు అనుగుణంగా పండించాల్సి పంటలపై రైతాంగానికి అవగాహన కల్పిస్తున్నాం. దిగుబడులు పెంచేందుకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై కూడా క్షేత్రస్థాయిలో రైతులను చైతన్యం చేస్తున్నాం. యాసంగి పంటల శాతం పెరుగుతుంది.

– కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

వరి కోతలు పూర్తికాలేదు



వాతావరణంలో మార్పులకు అనుగుణంగా వ్యవసాయాధికారుల సూచనలు తీసుకుని పంటలను వేస్తున్నాం. ఖరీఫ్‌లో వరి నాట్లు ఆలస్యంగా వేశాం. వానాకాలం సీజన్‌లోని వరికోతలు ఇంకా జరుగుతున్నాయి. వానాకాలం సీజన్ పూర్తయిన సాగుభూముల్లో భూసారాన్ని బట్టి అధికారుల సలహాలతో పంటలు సాగు చేస్తున్నాం. మా ప్రాంతంలో మొక్కజొన్న ఎక్కువగా వేస్తున్నాం.

– పూనెం నాగరాజు, కాచనపల్లి

గత, ప్రస్తుత యాసంగి అంచనా, పంటల సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

పంటలు	2022-23 అంచనా విస్తీర్ణం	2022-23 సాగు విస్తీర్ణం	2023-24 సాగు విస్తీర్ణం
వరి	62,417	36,867	47
జొన్న	944	807	58
మొక్కజొన్న	28,497	16,913	8,578
పత్తి	145	34	0
పెసర	880	1,428	118
మినుము	858	837	108
కంది	21	46	0
వేరుశనగ	2,747	2,414	559
కుసుమ	249	410	22
పొద్దుతిరుగుడు	501	514	89

పంటలు	2022-23 అంచనా విస్తీర్ణం	2022-23 సాగు విస్తీర్ణం	2023-24 సాగు విస్తీర్ణం
అలసంద	1,651	1,146	0
ఉలవ	0	9	0
మిర్చి	5,405	4,082	4,081
చెరకు	1,288	675	0
పొగాకు	1,222	1,128	0
ఆయిల్‌పామ్	45,535	45,535	59,301
కూరగాయలు	2,288	2,301	458
ఇతరాలు	57,814	57,814	57,814
మొత్తం	2,12,462	1,72,960	1,31,233

'గృహలక్ష్మి'కి నిరాశ



గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రొసీడింగ్స్ జారీ
- ఉమ్మడి జిల్లాలో 1,69,053 దరఖాస్తుదారులు
- ఇంటి పథకాన్ని రద్దు చేస్తూ కొత్త సర్కారు నిర్ణయం
- ఆ స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు సన్నాహాలు

చుంచుపల్లి: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రారంభించిన గృహలక్ష్మి పథకాన్ని కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలు పొంది ఇంటి నిర్మాణం కోసం ఆశలు పెట్టుకున్న లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. గత ప్రభుత్వం గృహలక్ష్మి ఇంటి పథకంలో ఇల్లు నిర్మించుకునేందుకు పేదలకు రూ.3 లక్షలను అందిస్తామని చెప్పడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. గత సెప్టెంబర్‌లో దరఖాస్తులపై విచారణ పూర్తి చేసి అధికారులు ఉత్తర్వులు అందజేస్తున్న క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చి పడింది. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవగా కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సొంత ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలను అందిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ పథకానికి త్వరలో రూపకల్పన చేయనున్న నేపథ్యంలో గృహలక్ష్మి పథకాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. దీంతో పథకం మంజూరు పత్రాలు కూడా రద్దయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో 1,69,053 దరఖాస్తులు

ఉమ్మడి జిల్లాలో గృహలక్ష్మి పథకాన్ని 1,69,053 దరఖాస్తులు అందాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 86,773 దరఖాస్తులు, ఖమ్మం జిల్లాలో 82,280 అర్జీలు వచ్చాయి. గత ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 3 వేల చొప్పున ఇళ్లను కేటాయించిన విషయం తెలిసిందే. దరఖాస్తులను విచారించిన అధికారులు ఉమ్మడి జిల్లాలో సుమారు 58 వేల మందిని ప్రాథమికంగా అర్హులుగా గుర్తించారు. గత అక్టోబర్ మొదటి వారంలో మంత్రి, ఎమ్మెల్యేల చేతుల మీదుగా మండలానికి 21 మంది చొప్పున మంజూరు పత్రాలు అందించారు. అదే నెల 9న అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, ప్రక్రియ అంతటితోనే ఆగిపోయింది. కాగా గత ప్రభుత్వం పోయి కొత్త ప్రభుత్వం రావడంతో కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు సన్నహాలు చేస్తోంది. త్వరలో ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ప్రకటించాల్సి ఉంది.

మంజూరుపత్రం ఇస్తే సంతోషపడ్డాం



గృహలక్ష్మి పథకానికి నేను సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు ఇంటికి వచ్చి అన్ని రకాల వివరాలు నమోదు చేసుకున్నారు. నాకు ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే, మండల అధికారుల సమక్షంలో ప్రొసీడింగ్స్ సైతం ఇచ్చారు. దీంతో చాలా సంతోష పడ్డాం. ఇప్పుడు ఆ పథకాన్ని కొత్త సర్కారు రద్దు చేస్తున్నట్లు చెప్పడంతో కొంత నిరాశకు లోనయ్యాం. మాకు కనీసం ఇందిరమ్మ ఇళ్ల పథకంలోనైనా తొలి ప్రాధాన్యత కల్పించాలి.

– భూక్యా రాధ, త్రీ ఇంక్లైన్, కొత్తగూడెం

వార్షిక లక్ష్యాలను అధిగమించాలి



కేటీసీలో పరిశీలిస్తున్న సీఎండీ బలరామ్ తదితరులు

టేకులపల్లి: సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలని సింగరేణి సీఎండీ, డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ సూచించారు. ఆదివారం ఆయన ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం ఓసీని సందర్శించారు. వ్యూ పాయింట్ నుంచి క్వారీలో జరుగుతున్న ఓబీ, బొగ్గు వెలికితీత పనులను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి రోజువారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలు తెలుసుకున్నారు. పని ప్రదేశాలను పరిశీలించి, సర్ఫేస్ మైనర్ పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఎండీ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సూచించారు. తొలుత ఆయనకు కేటీసీ అధికారులు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటేశ్వర్ రెడ్డి, ఎన్‌వీకే శ్రీనివాస్, జీఎంలు గురవయ్య, దీక్షితులు, జాన్ ఆనంద్, ఇతర అధికారులు ప్రహ్లాద్, మోహన్ రావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

కొత్తగూడెంటౌన్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చూపి, పలు పతకాలు సాధించారు. జిల్లాకు చెందిన 23 మంది మాస్టర్లు పోటీల్లో పాల్గొని 32 బంగారు పతకాలు, 11 వెండి పతకాలు, 2 కాంస్య పతకాలు సాధించారు. ఈ నెల 13 నుంచి 17 వరకు పుణేలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు థ్లెటిక్స్ జిల్లా సెక్రటరీ సముద్రాల శ్రీనివాస్ ఆదివారం వివరాలు వెల్లడించారు.

పాత పెన్షన్ విధానమే అమలుచేయాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి



మాట్లాడుతున్న చావా రవి

చర్ల: కేంద్రం అమలు చేస్తున్న పీఎఫ్ ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కిశోర్‌సింగ్ అధ్యక్షతన ఆదివారం సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం చర్లలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించి, పేదలకు నష్టం కలిగించి, ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్న జాతీయ విద్యా విధానం–2020ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయాలని, బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా ఉంటూ జీఓ నంబర్ 317 అప్పీళ్లన్నీ పరిష్కరించాలని కోరారు. పండిట్లు, పీఈటీల అప్‌గ్రేడ్ సమస్యలను తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ ఎరియర్స్, ఇతర బిల్లులు చెల్లించాలని కోరారు. మెగా డీఎస్సీ ప్రకటించి ఖాళీగా ఉన్న 22 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లు, అటెండర్లు, వాచ్‌మెన్‌లను నియమించాలని చెప్పారు. తొలుత జాతీయ, సంఘం పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గీదా కోదండరామయ్య, జెడ్పీటీసీ ఇర్పా శాంత, ఎంపీటీసీ మడకం పద్మజ, సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రాజు, నాయకులు ఎం.క్రిష్టియన్‌దాస్, టీవీ చలం, బి.మురళీమోహన్, వి.వరలక్ష్మి, కె.వెంకటేశ్వర్లు, కె.రాంబాబు, వి.బాలకృష్ణ, కె.యాదగిరి, ఎస్. బాలకృష్ణ తతదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై మంత్రుల సమీక్ష



ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ఖమ్మంఅర్బన్ : సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటి విడుదలకు ఎలాంటి అవకాశాలు ఉన్నా ఉపయోగించి జిల్లాలో ఎక్కువ ఆయకట్టుకు నీరందించేలా చర్యలు చేపట్టాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఉత్తమకుమార్‌రెడ్డి చాంబర్‌లో జలవనరుల శాఖ ఉన్నత స్థాయి అధికారులతో ఆదివారం సమీక్షించారు. మే నెలాఖరు నాటికి సీతారామ కాలువల పనులు పూర్తి చేయాలని, సత్తుపల్లి, పాలేరు టన్నెల్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. సీతారామ ఎత్తిపోతల పథకంపై చర్చించారు. సీతారామ పనుల పురోగతి, చేపట్టాల్సిన కార్యాచరణపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వ్యవసాయ మంత్రి తుమ్మల పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సాగు నీరందించే ఉద్దేశంతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా సమీక్షించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారావు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సీతారామ ప్రాజెక్ట పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనుకున్న స్థాయిలో పనుల్లో వేగం పెంచితే ఈ ఏడాదిలోనే వైరా ప్రాజెక్టు, లంకాసాగర్, ఎన్నెస్పీ ఆయకట్టులోని సుమారు 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని చెప్పారు. సీతారామ ప్రాజెక్టుకు ఇప్పటికే సుమారు రూ.7,500 కోట్లు ఖర్చు చేశారని, మూడు పంప్‌హౌస్‌లు పూర్తయ్యాయని తెలిపారు. ఏన్కూరు వద్ద లింక్ కెనాల్ పనులకు టెండర్లు పూర్తి చేసి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సుమారు రూ.70 కోట్లతో ఈ పనులు పూర్తి చేస్తే వచ్చే సీజన్‌లోనే వైరా ప్రాజెక్టు, లంకసాగర్, బేతుపల్లి పరిధిలో ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉందని వివరించారు. ఇటీవల గండుగులపల్లిలో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. దశల వారీగా ప్రాధాన్యతను బట్టి పనులు పూర్తిచేయాలని ఈ సందర్భంగా ఉత్తమ్ అధికారులకు సూచించారు. సత్తుపల్లి ట్రంక్ కెనాల్ భూ సేకరణకు రూ.12 కోట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాలేరు టన్నెల్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఎన్‌సీ మురళీధర్, ఖమ్మం జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్, సాగర్ డ్యాం సీఈ అజయ్‌కుమార్, సూర్యాపేట ఎస్ఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా..

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- స్నానాల లక్ష్మీపురంలో పర్యటన

వైరా/వైరారూరల్: తనకు జన్మనిచ్చిన స్నానాల లక్ష్మీపురాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి గ్రామ రుణం తీర్చుకుంటానని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. డిప్యూటీ సీఎం హోదాలో భట్టి విక్రమార్క తొలిసారి తన స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురం వచ్చిన సందర్భంగా స్థానికులు పూలు చల్లుతూ నీరాజనం పలికారు. భట్టి తన సతీమణి నందిని, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌తో కలిసి ఓపెన్‌టాప్ జీపులో గ్రామస్తులకు అభివాదం చేస్తూ ముందుకు సాగగా, స్థానికులు మేళతాళాలు, బాణసంచా కాల్చారు. ఆ తర్వాత భట్టి దంపతులు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనగా వారికి దేవాదాయ శాఖ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వైరా నది ఒడ్డున గల తల్లిదండ్రులు, సోదరుడి సమాధుల వద్ద భట్టి పూలమాలలతో నివాళులర్పించారు. ఆ తర్వాత గ్రామంలో ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ.. తనకు జన్మనిచ్చి, రాజకీయంగా ఇంత వాడిని చేసిన గ్రామ రుణం తీర్చుకుంటానని తెలిపారు. ఎంతో పురాతన చరిత్ర కలిగిన రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఖమ్మం ఆర్డీఓ గణేష్, అదనపు డీసీపీ ప్రసాదరావు, వైరా, సత్తుపల్లి ఏసీపీలు ఎం.ఏ. రెహమాన్, రామానుజం, ఖమ్మం ఏడీఎఫ్ అంజనేయస్వామి, సీఐలు సాగర్, కరుణాకర్, వైరా ఏడీఏ బాబురావు, తహసీల్దార్ కేవీకే శ్రీనివాసరావు, ఎంపీడీఓ డి. కరుణాకర్‌రెడ్డి తదితరులు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. సిరిపురం – స్నానాల లక్ష్మీపురం గ్రామాల మధ్య హైలెవల్ వంతెన పెండింగ్ నిర్మాణ పనుల గురించి స్థానికులు భట్టి దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు వైరా వ్యవసాయ మార్కెట్ వద్ద ఎమ్మెల్యే రాందాస్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు తదితరులు భట్టి విక్రమార్కకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ అమ్మిక రామారావు, ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, ఆలయ చైర్మన్ చింతనిప్పు రాంబాబు, దొడ్డా పుల్లయ్య, నూతి వెంకటేశ్వర్లు, పణితి సైదులు, మిట్టపల్లి నాగి, దార్నా రాజశేఖర్, దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రుల సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న భట్టి దంపతులు

జిల్లా పంచాయతీ జట్టు గెలుపు

ఐడీఓసీ ఉద్యోగులకు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

కొత్తగూడెంఅర్బన్: ఐడీఓసీ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా జరిగింది. ఆదివారం రామవరం సాధన గ్రౌండ్స్‌లో ఐడీఓసీ పరిధిలోని ఉద్యోగులు నాలుగు జట్లుగా విడిపోయి క్రికెట్ ఆడారు. రోజూ పని ఒత్తిడిలో బిజీగా ఉండే ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. కలెక్టర్ పేషీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఆర్అండ్‌బీ సిబ్బంది, జిల్లా పంచాయతీ సిబ్బంది జట్ల మధ్య పోటీ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ పోటీల్లో విజేతగా జిల్లా పంచాయతీ జట్టు నిలిచింది. రెండో స్థానంలో కలెక్టర్ పేషీ జట్టు నిలిచింది. జిల్లా పంచాయతీ జట్టు కెప్టెన్ విక్రమ్, కలెక్టర్ పేషీ జట్టు కెప్టెన్ దినేష్ బహుమతులు అందుకున్నారు.



బహుమతి అందుకుంటున్న విజేత జట్టు

క్లుప్తంగా

తిరుపతి వేంకటేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే



తిరుపతిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఆయన తలనీలాలు సమర్పించి, కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు.

29, 30 తేదీల్లో బాలోత్సవ్

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 29, 30వ తేదీల్లో కొత్తగూడెంలో అభ్యుదయ కళా సేవా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ బాలోత్సవ్-6 నిర్వహించనున్నట్లు బాలోత్సవ్ కన్వీనర్ మద్దెల శివకుమార్ తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్, శాస్త్రీయ, జానపద నృత్యాలు పాటలు, వాయిద్య సంగీతం, ఫ్యాన్సీ డ్రెస్సెస్ తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. నిర్వాహకులు అల్లి శంకర్, కలవల రాందాస్, తాండూర్ ధనరాజ్, స్టీవెన్ లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

వరికోత యంత్రం దగ్ధం



దగ్ధమవుతున్న వరి కోత యంత్రం

అశ్వారావుపేటరూరల్: ప్రమాదవశాత్తు వరి కోత యంత్రం దగ్ధమైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని గాడ్రాల గ్రామానికి చెందిన రైతు తుట్టి మహేశ్ పొలంలో వరికోత యంత్రంతో పనులు చేస్తుండగా, ఒక్కసారిగా ఇంజన్ భాగంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చేలరేగాయి. ఈ ప్రమాదంలో వాహనం దగ్ధం కాగా, సుమారు రూ.7 లక్షలు నష్టం వాటిల్లిందని యజమాని తెలిపారు. సమాచారం అందుకున్న అశ్వారావుపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి ట్రక్కు దగ్ధం

ఎర్రుపాలెం: మండలంలోని గుంటుపల్లిగోపవరం గ్రామంలో ఆదివారం విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి ట్రాక్టర్ ట్రక్కు, వరిగడ్డి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ రైతు ట్రాక్టర్ ట్రక్కులో వరిగడ్డిని తరలిస్తుండగా గ్రామంలో విద్యుత్ తీగలు తాకాయి. దీంతో మంటలు చెలరేగి గడ్డి, ట్రక్కు పూర్తిగా దగ్ధమయ్యాయి.

జ్యూయలరీ దుకాణం నిర్వాహకుడిపై కేసు

పాల్వంచ: గాజు ముక్కతో దాడి చేసిన జ్యూయలరీ షాపు నిర్వాహకుడిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ బి.రాము కథనం ప్రకారం.. పట్టణంలోని శ్రీధనలక్ష్మీ జ్యూయలరీ దుకాణం నిర్వాహకుడు లంక రాము అవసరం నిమిత్తం కొంచాడ కృష్ణ వద్ద కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు. ఈ విషయంలో రాము, కృష్ణ గొడవపడుతుండగా మధ్యలో కృష్ణ సోదరుడు సంతోష్ వెళ్లడంతో రాము చంపుతానంటూ గాజు ముక్కతో చేతిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సంతోష్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని వచ్చి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లంకా రాముపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిలిచిన తాగునీటి సరఫరా

పైప్‌లైన్ లీకేజీతో ఐదు మండలాలకు బంద్



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా ఆదివారం ఐదు మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తనికెళ్ల వద్ద 900 ఎంఎం పైప్ లైన్‌కే లీకేజీ ఏర్పడటంతో నీరంతా వృథాగా పోతోంది. కొణిజర్ల, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఐదు మండలాల్లో సుమారు వందకు పైగా గ్రామాలకు తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది హుటాహుటిన లీకేజీ అయిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని గ్రిడ్ ఏఈ చైతన్య తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.12,448

'సాక్షి' స్పెల్‌బీకి అనూహ్య స్పందన

రీజినల్ స్థాయి పరీక్షకు 150 మందికిపైగా హాజరు

ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం

కాజీపేట: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రీజినల్ స్థాయి స్పెల్ బీ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. కాజీపేట శివారు తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన ఈ పరీక్షకు తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి 150 మందికిపైగా విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 'సాక్షి' వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటిసారిగా రీజినల్ స్థాయి పోటీ పరీక్ష వరంగల్‌లో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్ పరంగా నాలెడ్జ్ పెరుగుతుందని చెప్పారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసే ప్రయత్నంలో 'సాక్షి' ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్‌గా గ్లాట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ రాజమండ్రి వ్యవహరిస్తున్నారని చెప్పారు. కాగా, తమ స్కూళ్లలో కూడా ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహించాలనుకుంటే ఆయా పాఠశాలల యాజమాన్యాలు 9505514424 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో 'సాక్షి' వరంగల్ బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, టీవీ కరస్పాండెంట్ తుమ్మ శ్రీధర్‌రెడ్డి, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్‌గుప్తా, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, తాళ్లపద్మావతి ప్రిన్సిపాల్ అఫ్జల్ ఉన్నీసా, సృజన్, రాకేష్, యామిని, మహేందర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థుల మనోగతం ఇలా ఉంది..



సోమిడిలోని తాళ్ల పద్మావతి కళాశాలలో 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పిల్లలు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తున్నారు



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ ఇంగ్లిష్ పోటీ పరీక్షలు పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. భాషపై నెలకొన్న భయాన్ని దూరం చేసేందుకు ఈ పరీక్షలు ఉన్నాయి. ఈ పోటీలకు మా కళాశాల వేదికగా మారడం సంతోషంగా ఉంది.

– తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్

ఇంగ్లిష్‌పై ఆసక్తి పెరిగింది..



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనే ఉద్దేశంతో కొత్త పదాలు నేర్చుకోవడం మొదలు పెట్టిన తరువాత ఇంగ్లిష్ భాషపై ఇంకా ఆసక్తి పెరిగింది. కొత్త పదాలు కనిపించినప్పుడు వాటి స్పెల్లింగ్ పునశ్చరణ చేసుకుంటున్నా.

– పి.అధితి, రావూస్ టెక్నో స్కూల్, కరీంనగర్

ప్రయోజనకరంగా ఉంది



మృతృభాషతో పాటు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తేనే లక్ష్యాలను చేరుకుంటాం. తరగతి పుస్తకాలతో పాటు దిన పత్రికలు చదువుతూ ఇంగ్లిష్ నేర్చుకుంటున్నా. నా ప్రయత్నానికి స్పెల్‌బీ పరీక్ష ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

– మదియా, శ్రీఅరవిందో హైస్కూల్, జనగామ

ఉపాధ్యాయుల సహకారం బాగుంది..



స్పెల్‌బీ పరీక్ష రాయడం వల్ల ఉత్సాహం రెంట్టింపు అయింది. ఇంగ్లిష్‌పై నాలో ఉన్న పట్టుదలను గుర్తించిన ఉపాధ్యాయులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనేలా ప్రోత్సహించారు. ఫైనల్స్‌కు వెళ్తాననే నమ్మకం మరింత పెరిగింది.

– వంశిక, ఎంజేపీ, బాలికల ఉన్నత పాఠశాల, కమలాపూర్

భాష సులువు అనిపిస్తోంది..



స్పెల్‌బీ ఇంగ్లిష్ పరీక్ష రాయడం వల్ల భాష సులువు అనిపిస్తోంది. ఉచ్చారణ బాగా వస్తోంది. పదాలు గుర్తు పెట్టుకోవడం, కొత్త పదాలు వెతకడం వల్ల ఇంగ్లిష్‌పై పట్టు సాధించొచ్చు. 'సాక్షి'కి కృతజ్ఞతలు.

– నిహారిక శర్మ, లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, మిర్యాలగూడ

పోటీ పరీక్షలతో ఎంతో మేలు



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్‌బీ పోటీలు నాలో నూతనోత్సాహం నింపాయి. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి చక్కటి మార్గం. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలకు హాజరైతే ప్రతిభ పెరుగుతుంది.

– కె.కార్తికేయ, జయ ఐఐటీ ఒలంపియాడ్ స్కూల్, సూర్యాపేట

మరికొన్ని పదాలు నేర్చుకున్నా..



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్‌లో మరికొన్ని కొత్త పదాలు నేర్చుకోవడంతోపాటు ఆ పదాలు పలికే విధానం తెలుసుకున్నా. ఇప్పుడు ఎలాంటి భయం లేకుండా ఇంగ్లిష్ మాట్లాడొచ్చనే నమ్మకం పెరిగింది.

– ఎం.సాయిప్రియ, సాధన స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, కరీంనగర్

ప్రతిభను సానబెట్టేందుకు..



విద్యార్థుల్లోని ప్రతిభను సానబెట్టేందుకు, పోటీతత్వం పెంచేందుకు స్పెల్‌బీ, ఇంగ్లిష్ పరీక్షలు ఉపయుక్తంగా ఉంటాయి. విద్యార్థులకు స్పెల్లింగ్‌లో పట్టు పెరుగుతుంది. ఇలాంటి పరీక్షలు ఎంతో దోహదపడతాయి.

– బి.సాన్వి, ఒయాసిస్ హైస్కూల్, స్టేషన్‌ఘన్‌పూర్

ఏర్పాట్లు బాగున్నాయి



పిల్లలు ఇంగ్లిష్ భాషపై చక్కటి ప్రతిభ కనబర్చడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచడానికి స్పెల్‌బీ ఎంతో ఉపయోగపడుతుంది. పరీక్ష ఏర్పాట్లు బాగున్నాయి. మరిన్ని పోటీ పరీక్షలు నిర్వహించాలి.

– సురేష్‌కుమార్, ఖమ్మం

మరింత పట్టు పెరిగింది..



'సాక్షి' ఏర్పాటు చేసిన పోటీ పరీక్షలకు హాజరుకావడం వల్ల గ్రామర్ సులభంగా నేర్చుకున్నా. ఇంగ్లిష్ భాషపై పట్టు పెరగడంతోపాటు ఎలా మాట్లాడాలనే విషయం అర్థమైంది. ఉత్సాహంగా పరీక్ష రాశా.

– రిషిత, రామన్ స్కూల్, సోమిడి

ఉపాధ్యాయుల సహకారంతో..



ఉపాధ్యాయుల సహకారంతో ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించా. ఆ తరువాత మాట్లాడడం నేర్చుకున్నా. స్పెల్‌బీ పోటీలకు హాజరవుతూ భాషపై మరింత పట్టు సాధించా.

– ఎస్.జస్వంత్, త్రివేణి స్కూల్, ఖమ్మం

శ్రమకు ఓర్చి పిల్లలను తీసుకొచ్చా..



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ స్పెల్‌బీ పోటీలకు హాజరుకావాలనే తలంపుతో శ్రమకు ఓర్చి పిల్లలను తీసుకొచ్చా. ఇలాంటి పరీక్షలు రాయడం వల్ల పిల్లల్లో పోటీతత్వం అలవడుతుందనే భావనతో వచ్చాం.

– అర్చన, జనగామ

ఇంగ్లిష్‌పై భయం పోయింది



ఇంగ్లిష్‌పై నెలకొన్న భయం పోగొట్టడంలో 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష ఉపయోగపడింది. ఇంగ్లిష్ అంటే కష్టంకాదని, ఎంతో సులభంగా నేర్చుకోవచ్చనే భావన కలిగింది. సహ విద్యార్థులతో పోటీపడి పరీక్షకు సన్నద్ధమయ్యా.

– బి.సాయిపల్లవి, ఏకశిల పబ్లిక్ స్కూల్, జనగామ

భారీగా గంజాయి పట్టివేత

భద్రాచలంటౌన్: ఏపీలోని చింతూరు నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని పట్టణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరరావు ఆదివారం విలేకరుల వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బ్రిడ్జిసెంటర్ ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యాన్ అనుమానాస్పదంగా కనిపించింది. అందులో క్షుణ్ణంగా పరిశీలించగా ఖాళీ ట్రేల మధ్యలో ఎండు గంజాయిని గుర్తించారు. డ్రైవర్ విజయ్‌నందుగైక్వాడ్‌ను అదుపులోకి విచారించగా నాసిక్‌కి చెందిన మహావీర్ అశోక్‌మలుకు చెందిన గంజాయిని ఔరంగాబాద్‌కి రవాణా చేస్తున్నట్లు తేలింది. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, అతడి వద్ద నుంచి రూ.12 వేలు, ఒక మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నామని, గంజాయి, వ్యాన్‌ను సీజ్ చేశామని సీఐ వివరించారు. గంజాయి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ముబుషర్ అహ్మద్, హెడ్ కానిస్టేబుళ్లు కరీం, బాలు, సుధీర్, హరీశ్, వెంకటేశ్, హన్మంతరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నిందితుడు, గంజాయిని చూపిస్తున్న అధికారులు

జేసీబీ, బైక్ ఢీ.. యువకుడు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

జూలూరుపాడు: మండలంలోని అనంతారం గ్రామ సమీపంలో ఆదివారం జేసీబీ, బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పూనెం నాగేశ్వరరావు(29) బైక్‌పై కాకర్ల వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. అనంతారం గ్రామ సమీపంలో నూతన ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా జేసీబీతో మట్టి చదును చేస్తున్నారు. పని పూర్తి కావడంతో జేసీబీ రివర్స్‌లో రోడ్డుపైకి వస్తుండగా బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చూసిన ఆయన తల్లి సీతమ్మ బోరున విలపించింది. ఏఎస్‌ఐ తిరుపతిరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరాతీశారు. మృతుడి తల్లి సీతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జమలాపురం ఆలయ మాజీ చైర్మన్...



శివరామప్రసాద్ (ఫైల్)

ఎర్రుపాలెం: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ చైర్మన్ ఉప్పల శివరామ్‌ప్రసాద్ (81) ఆదివారం మృతి చెందారు. ఆయన కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు శీలం కవిత, సర్పంచ్ ముల్పూరి స్వప్న, సొసైటీ చైర్మన్ ముల్పూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు శైలజ, పంబి సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

ములకలపల్లి: రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును బైక్ ఢీకొట్టడంతో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మామిళ్లగూడెం గ్రామానికి చెందిన పైదా రాజులు (28) తన ద్విచక్రవాహనంపై సమీప బంధువు సాత్విక్‌తో కలిసి దమ్మపేట మండలంలోని కట్కూరు గ్రామానికి వెళ్లారు. శనివారం రాత్రి తిరిగి ఇంటికి వస్తుండగా జిన్నెలగూడెం అటవీ ప్రాంతంలో జామాయిల్ లోడుతో ఉన్న ట్రాక్టర్ ట్రక్కును ఢీకొట్టారు. ప్రమాదంలో రాజులుకు తీవ్రగాయాలు కాగా, సాత్విక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాజులు మృతి చెందాడు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజమౌళి తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎర్రుపాలెం: మండల కేంద్రం – తొండలగోపవరం రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. ఈ ఘటన ఖమ్మం వైపు వెళ్లే ఎగువ లైన్‌లో 540/8-6 వద్ద చోటుచేసుకుంది. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు, ఆధారాలు లభించలేదు. సమాచారం తెలుసుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని గుర్తించడం కోసం ఖమ్మం అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఖమ్మం రైల్వే ఎస్‌ఐ పి.భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ తెలిస్తే 99636 41484, 87126 58589 నంబర్లలో సంప్రదించాలని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి కోరారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సత్తుపల్లిటౌన్: మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సత్తుపల్లి మండలం కిష్టారంలో ఆదివారం చోటుచేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురానికి చెందిన కటారి నాగబాబు(19) సత్తుపల్లి మండలం కిష్టారంలోని ఓ పెట్రోల్ బంకులో కొన్ని రోజులుగా పని చేస్తున్నాడు. జీతం డబ్బులు ఇంట్లో ఇవ్వడం లేదని జల్సాలకు పెడుతున్నావని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన నాగబాబు ఆదివారం పురుగులమందు సేవించి బంకు సమీపంలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాము ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దాడి చేసిన వారిపై కేసు

ఖమ్మంక్రైం: నగరంలోని టూటౌన్ పరిధిలో ఓ కుటుంబంపై దాడి చేసిన వ్యక్తులపై ఆదివారం రాత్రి కేసు నమోదైంది. సీఐ కుమారస్వామి కథనం ప్రకారం.. ద్వారకానగర్‌లో అబ్బాస్ కుటుంబం నివాసం ఉంటోంది. శనివారం రాత్రి యోహాన్‌తో పాటు మరికొందరు అబ్బాస్ ఇంటిపై దాడిచేసి, కుటుంబ సభ్యులను దుర్భాషలాడారు. అబ్బాస్ భార్య సమీనా బేగం ఫిర్యా దు మేరకు దాడిచేసినవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

యువకుడు ఆత్మహత్య

నేలకొండపల్లి: ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆచార్లగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి (20) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వచ్చే సరికి విగతజీవిగా పడి ఉన్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

ములకలపల్లి: భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజమౌళి కథనం మేరకు.. సుందరయ్యనగర్‌కు చెందిన మడకం చలమలరావుకు.. చంద్రకళతో 2003లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. పదేళ్లుగా చలమలరావు మద్యం సేవిస్తూ, అదనపు కట్నం కోసం చంద్రకళను వేధిస్తున్నాడు. పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ చేశారు. శనివారం రాత్రి అతి గా మద్యం సేవించి చంద్రకళను కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు

పాల్వంచరూరల్: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి ఢీకొట్టిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాతపాల్వంచకు చెందిన డేగాల మోతేరు మండలంలోని పెద్దమ్మ గుడి వద్ద ఫంక్షన్‌హాల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా నవంబర్ 9వ తేదీన వెనుక నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం సీతానగర్‌కాలనీ ఎదుట ముత్యాలమ్మ గుడి వద్ద ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ప్రమాదానికి కారణమైన బంఢ్రుగొండకు చెందిన కంటి శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

సుతారి అదృశ్యంపై కేసు

ఖమ్మంఅర్బన్: నగరంలోని దానవాయిగూడెంనకు చెందిన సుతారి మద్దెల సైదులు కనిపించకుండా పోయాడని ఆయన కుమారుడు వినయ్ ఫిర్యాదుపై ఆదివారం ఖమ్మంఅర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. రోజులాగే సైదులు ఈ నెల 5న కూలీకి వెళ్లి తిరిగి రాలేదు. అనేక చోట్ల ఆరా తీసినా ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

ఆలయంలో చోరీ

మధిరరూరల్: మండలంలోని నిదానపురం క్రాస్ రోడ్డులో ఉన్న ఎల్లమ్మ ఉప్పలమ్మ తల్లి (అమరావతి అమరలింగేశ్వర స్వామి) దేవాలయంలో ఉన్న హుండీని శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. హుండీలో సుమారు రూ.10 వేల విలువైన కానుకలు ఉండవచ్చని ఆలయ పూజారి నర్సింగి చిన్ననాగయ్య తెలిపారు. ఈ ఘటనపై మధిర రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం వద్ద ఖమ్మం – వైరా ప్రధాన రహదారిపై కారును వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో కారులోని వ్యక్తులకు స్వల్పగాయాలైన ఘటనపై ఆదివారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఖమ్మం బ్యాంక్‌కాలనీకి చెందిన చావా మంజూష తన కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మం నుంచి ఖమ్మంఅర్బన్ మండలం సుల్తాన్‌గుట్ట గ్రామానికి వెళ్తోంది. మార్గమధ్యలో ఓ దాబా దాటిన తర్వాత యూటర్న్ తీసుకునే క్రమంలో ఖమ్మం నుంచి వైరా వైపుగా వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. మంజూష ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన యువతి ఆచూకీ లభ్యం

మధిర: మతిస్థిమితం కోల్పోయి దారితప్పి వచ్చిన యువతి ఆచూకీ కనుగొని వారి బంధువులకు అప్పగించిన ఘటన ఆదివారం మధిర పట్టణంలో చోటుచేసుకుంది. మిర్యాలగూడెంనకు చెందిన గుర్రం సునీత (25) మతిస్థిమితం లేక మధిర రైల్వే స్టేషన్‌లో రైలు నుంచి దిగి నడుచుకుంటూ మధిర పట్టణంలోని వైఎస్‌ఆర్‌చౌరస్తాకు చేరుకుంది. మధిర టౌన్ ఎస్‌ఐ రాజేశ్ శనివారం అర్ధరాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చలిలో దయనీయ పరిస్థితిలో యువతి ఒక దుకాణం ఎదుట కూర్చుని ఉండటాన్ని గమనించారు. ఈ విషయాన్ని ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతికి తెలుపగా వారి సహాయంతో ఆమెను స్థానిక అనాథ ఆశ్రమానికి తరలించారు. సునీత తల్లిదండ్రులకు ఈ విషయం తెలిసి మధిర టౌన్ పోలీసులను ఆశ్రయించారు. మతిస్థిమితం లేక భర్తను, పాపను వదిలి నెలరోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయిన సునీత ఆచూకీ తెలియడంతో కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేశారు. పోలీసులు, అనాథ ఆశ్రమ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి దంపతుల సహకారంతో సునీతను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వారికి సునీత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



సునీతను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు, అనాథ ఆశ్రమ నిర్వాహకులు

లోకేశ్ మాకొద్దు 'బాబూ'..!

చినబాబు పర్యటనలతో పార్టీ పరువు పోతోందని తమ్ముళ్ల గగ్గోలు

- ఆయన ప్రసంగాలు, వ్యవహారశైలి బాగోలేదని ఆందోళన
- అందుకే వ్యూహాత్మకంగా పాదయాత్ర తర్వాత లోకేశ్ పర్యటనలకు చంద్రబాబు చెక్
- 'రా కదలిరా', జయహో బీసీ వంటి ముఖ్య కార్యక్రమాలకూ దూరం
- మంగళగిరికే పరిమితమై అప్పుడప్పుడు లోకల్‌గా చక్కర్లు



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీకి 'లోకేశ్' తలనొప్పి పట్టుకుంది. ఆ పేరు వింటేనే ఆ పార్టీ నేతలు బెంబేలెత్తిపోతున్నారు. ఆయనవల్ల పార్టీ పరువుతో పాటు తమ పరువు పోతోందని లబోదిబోమంటున్నారు. తమ నియోజకవర్గాలకు ఆయన రాకుండా చూడాలని ముఖ్య నేతలకు బహిరంగంగానే వేడుకుంటున్నారు. లోకేశ్ ప్రసంగాలు, వ్యవహారశైలి వల్ల ఉన్న ఓట్లుకూడా పోయే పరిస్థితి ఉందని వారు మొత్తుకుంటున్నారు. లోకేశ్ మాట్లాడేటప్పుడు అన్నీ తప్పులు మాట్లాడడం, తెలుగు పదాలు సరిగా ఉచ్ఛరించలేకపోవడం వల్ల సోషల్ మీడియాలో లోకేశ్ తొలినుంచి విపరీతంగా ట్రోల్ అవుతున్న విషయం తెలిసిందే. అవగాహనా రాహిత్యంతో ఏదో ఒకటి మాట్లాడేయడం వల్ల ఆయనవల్ల పార్టీ అనేక సార్లు ఇరకాటంలో పడింది. ప్రజలను ఆకర్షించలేక పోగా ఆయన చేష్టలు, డైలాగులవల్ల పార్టీకి నష్టమే తప్ప ఎలాంటి లాభంలేదనే భావన మొదటి నుంచి పార్టీ నేతల్లో బలంగా నాటుకుపోయింది. కానీ, తానే పార్టీని మొత్తం నడిపిస్తున్నట్లు లోకేశ్ బిల్డప్ ఇస్తూ పర్యటనలు చేసి తమకు ఎక్కడలేని ఇబ్బందికర పరిస్థితులు సృష్టించారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే విషయాన్ని చంద్రబాబుకు పలువురు ముఖ్యులు అనేకసార్లు చెప్పినా ఆయన విని ఊరుకునే వారే తప్ప ఎలాంటి స్పందన ఉండేది కాదు. ఇప్పుడు ఎన్నికల సమీపించడంతో నేతలు ఈ విషయాన్ని గట్టిగా చెబుతుండడంతో పార్టీ శ్రేణుల ఒత్తిడికి చంద్రబాబు తలొగ్గక తప్పలేదు. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో లోకేశ్‌ను జిల్లా పర్యటనలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు నిర్ణయించారు. దీంతో కొద్దిరోజులుగా లోకేశ్ జిల్లాల పర్యటనలు చేయడం లేదు. పార్టీ ముఖ్య కార్యక్రమాలకు సైతం ఆయన్ను రానీయడంలేదు. యువగళం పాదయాత్ర తర్వాత లోకేశ్ జిల్లా పర్యటనలు, పార్టీ ముఖ్య కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటున్నారు.

పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్‌తో కనువిప్పు..

నిజానికి.. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ అయింది. దీనికోసం తెలుగుదేశం పార్టీ నాయకులు, శ్రేణులు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. సోషల్ మీడియా, ఎల్లో మీడియాలో ఆయనకు ఎంత ప్రచారం కల్పించినా బూడిదలో పోసిన పన్నీరైంది. ఆయన సభలకు జనాన్ని సమీకరించలేక నేతలు చేతులెత్తేశారు. డబ్బులిచ్చినా, ప్రలోభాలకు గురిచేసినా లోకేశ్ సభలంటే జనం వచ్చే పరిస్థితిలేదని పార్టీ నేతలు తరచూ వాపోయేవారు. ఈ సమయంలో.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అరెస్టవడంతో లోకేశ్ తన పాదయాత్రను అర్థాంతరంగా నిలిపివేశారు. తనను కూడా అరెస్టుచేస్తారనే భయంతో ఢిల్లీ వెళ్లి అక్కడే మకాం వేశారు. ఆ సమయంలో పాదయాత్ర కొనసాగించాలని పార్టీ నేతలు ఎంత ఒత్తిడి చేసినా అరెస్టు భయంతో ఆయన జనాల్లోకి రాలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన తల్లి భువనేశ్వరితో తూతూమంత్రంగా 'నిజం గెలవాలి' పేరుతో ఒక కార్యక్రమం మొదలుపెట్టినా దానికీ ఆదరణ లభించలేదు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చాక లోకేశ్ తన పాదయాత్ర రూటుమార్చేసి, నడవలేక చేతులెత్తేసి చివరికి మమ అనిపించారు.

లోకేశ్ మంగళగిరికే పరిమితం..

ఈ పరిస్థితుల్లో.. లోకేశ్‌ను తెరవెనుక నుంచే ఎన్నికలకు పని చేయించాలని ముఖ్య నేతలు సూచించినట్లు సమాచారం. ఆయన పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంవల్ల నష్టమని వ్యూహకర్తలు కూడా తేల్చిచెప్పినట్లు తెలిసింది. దీంతో లోకేశ్‌ను ప్రస్తుతం మంగళగిరికి మాత్రమే పరిమితం చేశారు. ముఖ్యమైన పార్టీ కార్యక్రమాలకు సైతం ఆయన రావడంలేదు. చంద్రబాబు చేపట్టిన 'రా కదలిరా' కార్యక్రమాలకు ఆయన దూరంగానే ఉంటున్నారు. ఇటీవల నిర్వహించిన 'జయహో బీసీ' కార్యక్రమానికి సైతం చిన్నబాబు దూరంగా ఉన్నారు. గత ఎన్నికల్లో తాను పోటీచేసి ఓడిపోయిన మంగళగిరి నియోజకవర్గంలోనే ఆయన అడపాదడపా తిరుగుతున్నారు. అక్కడ డబ్బులిచ్చి కొందరు నాయకుల్ని మేనేజ్ చేస్తూ బిల్డప్ ఇచ్చుకోవడం.. చోటామోటా నేతలకు కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు చెప్పుకోవడం, స్థానికంగా చిన్నపాటి సమావేశాలతోనే ఆయన సరిపెట్టుకుంటున్నారు. అది కూడా కొంత సమయం మాత్రమే. ఎక్కువగా ఆయన హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. వచ్చే ఎన్నికల్లో అయినా ఎమ్మెల్యేగా గెలవాలని సూచిస్తూ ఆయన్ను మంగళగిరిపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించేలా చేయడంలో పార్టీ నేతలు ఓ రకంగా సఫలమయ్యారు. తద్వారా లోకేశ్ గండం నుంచి ప్రస్తుతానికి గట్టెక్కామని వారు భావిస్తున్నారు. తమ నియోజకవర్గాలకు ఆయన రాకుండా చూసుకుంటూ కొంతవరకైనా పరువు నిలుపుకోగలిగామని సంబరపడుతున్నారు.

మొత్తం మీద యువగళం పాదయాత్రవల్ల టీడీపీకి మైలేజ్ సంగతి ఎలా ఉన్నా అభాసుపాలైన ఘటనలే ఎక్కువ జరిగాయి.

'ఇక్కత్'కు ఇక్కట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

పటిష్టమైన చర్యలు తీసుకోవాలని చేనేత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బ్రాండ్ ఇమేజ్‌పై దెబ్బ

పట్టుదారానికి రంగులద్ది డిజైన్‌లు కట్టి నేసే ఇక్కత్ పట్టు చీరకు ఓ బ్రాండ్ ఇమేజ్ ఉంది. ఈ చీరలకు మహిళల్లో విశేష ఆదరణ ఉంది. పోచంపల్లి కేంద్రంగా తయారయ్యే పట్టు చీరలకు అంతర్జాతీయంగా గుర్తింపు కూడా ఉంది. అలాంటి పట్టు చీరల డిజైన్లను నిబంధనలకు విరుద్ధంగా ప్రింట్ చేసి తక్కువ ధరలకు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో చీర ధర పడిపోవడం, ఏది అసలీనో ఏది నకిలీనో గుర్తించలేకపోవడం, ఆన్‌లైన్‌లో మోసాలు జరగడం లాంటివి కూడా చోటు చేసుకుంటున్నాయి. గత రెండేళ్లుగా గుజరాత్‌లోని సూరత్ కేంద్రంగా పోచంపల్లి డిజైన్లతో ప్రింటెడ్ పాలిస్టర్ చీరలు బహిరంగ మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఈ చీరలు రూ.600 నుంచి రూ.1000 లోపే లభిస్తుండటంతో కొనుగోలుదారులు ఆకర్షితులవుతున్నారు.

భారీగా పడిపోయిన అమ్మకాలు: ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో 12,000 మంది చేనేత కళాకారులకు జియో ట్యాగ్ ఉంది. అంటే ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతినెలా ఒక జియో ట్యాగ్ కళాకారుడితోపాటు మరో ఇద్దరు అనుబంధ కళాకారులు ఉంటారు. అంటే సుమారు 36 వేల మంది నేరుగా వృత్తిలో ఉన్నారు. నెలకు ఒక చేనేత కుటుంబం ఐదు చీరలు తయారు చేస్తుంది. ఇలా తయారైన చీరలతో గతంలో నెలకు రూ. 40 కోట్ల వ్యాపారం జరిగేది. ప్రస్తుతం ప్రింటెడ్ చీరలు రాకతో రూ.20 కోట్లకు అంటే సగానికి సగం వ్యాపారం పడిపోయిందని నేతన్నలు చెబుతున్నారు.

మూట వ్యాపారం దాకా విస్తరణ: పోచంపల్లి ప్రింటెడ్ పట్టు చీరలు ఇప్పుడు గ్రామాల్లో మూట వ్యాపారం దాకా వచ్చాయి. గతంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌లోనే లభించే ప్రింటెడ్ చీరలు ఇప్పుడు పల్లెల్లోనూ అమ్ముతున్నారు. ప్రింటెడ్ చీరల అమ్మకాలను అరికట్టాల్సిన యంత్రాంగం చేతులెత్తేయడంతో పోచంపల్లి చీరల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని స్థానిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ప్రింటెడ్ చీరలను అదుపు చేయాలి



జీఐ పొందిన ఇక్కత్ చేనేత చీరలను పోలిన ప్రింటెడ్ చీరల తయారీని ప్రభుత్వం అరికట్టాలి. ఇటీవల పోచంపల్లికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కేంద్ర జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రచనా సాహు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. గుజరాత్‌లో ప్రింటెడ్ చీరల తయారీని, షాపింగ్ మాల్స్‌లో అమ్మకాలను నిరోధించాలి. కల్యాణ లక్ష్మి నగదు సహాయంతోపాటు పోచంపల్లి పట్టు చీరను వధువుకు ఇవ్వాలి. ఇక్కత్ వృత్తిని కాపాడాలి.

– తడక రమేష్, చేనేత సంఘం నాయకులు, పోచంపల్లి

మాల్స్‌పై మరిన్ని దాడులు చేస్తాం

పోచంపల్లి పట్టు చీరలను పోలిన ప్రింటెడ్ చీరలు సూరత్ నుంచి వస్తున్నాయి. షాపింగ్ మాల్స్‌లో అమ్ముతున్నారన్న విషయాన్ని గుర్తించి దాడులు చేస్తున్నాం. ప్రతి డిజైన్‌ను కాపీతో ప్రింట్ చేసి చీరలను విక్రయిస్తున్నారు. చేనేత వృత్తిదారులకు ఇది తీరని నష్టం కలిగిస్తోంది. త్వరలో మరిన్ని దాడులు చేయబోతున్నాం.

– వెంకటేశ్వర్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

పాతబస్తీలో యువతిపై గ్యాంగ్‌రేప్

- రాత్రివేళ ఎంజీబీఎస్ బయట ఎత్తుకెళ్లిన ఇద్దరు దుండగులు
- సోదరుడితో గొడవపడి సూర్యాపేట నుంచి వచ్చిన బాధితురాలు

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ పాతబస్తీలోని బండ్లగూడలో అమానుష ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులతో గొడవపడి రాత్రిపూట సూర్యాపేట నుంచి నగరానికి వచ్చిన ఓ యువతిపై ఇద్దరు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన చాంద్రాయణగుట్టలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన యువతి (21) తన సోదరుడు, తల్లితో కలసి అక్కడే ఉంటోంది. ఈ నెల 6న సోదరుడితో గొడవ జరగడంతో అతడు ఆమెపై చేయిచేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి.. సూర్యాపేటలో బస్సెక్కి ఎంజీబీఎస్‌లో రాత్రి 10:40 గంటలకు దిగింది. బయటకు వచ్చిన ఆమె టీ తాగి రోడ్డు దాటుతుండగా అటుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమెను ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. ఏదైనా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని యువతి తెలిపింది. అయితే తాము కూడా అటే వెళ్తున్నామంటూ బైక్ ఎక్కాలని కోరారు. అయితే తాను ఆటోలో వస్తానని చెప్పినా వినకుండా యువతిని బైక్‌పై ఎక్కించుకున్నారు. ఆపై సిద్దంబర్ బజార్‌కు తీసుకెళ్లి ఐస్‌క్రీమ్ తినిపించి చాంద్రాయణగుట్ట బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గోడౌన్‌కు తీసుకెళ్లారు. ఆమెను కొట్టి బలవంతంగా ఒకరి తర్వాత మరొకరు అత్యాచారానికి పాల్పడ్డాడు. వారి చెర నుంచి తప్పించుకున్న బాధితురాలు.. బయటకు పరుగుతీసి కేకలు వేయడంతో స్థానికులు గమనించారు. దీంతో నిందితులు పరారయ్యారు. సమాచారం అందుకున్న బండ్లగూడ పోలీసులు అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో ఘటనాస్థలికి చేరుకొని బాధితురాలిని స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు స్వీకరించారు. కాగా, నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

'ఇందిరమ్మ'లోకి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు!

గత ప్రభుత్వం ప్రారంభించిన ఇళ్లు దాదాపు 2.28 లక్షలు.. వాటిల్లో పూర్తయినవి 1.53 లక్షలు

గత బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలోకి మార్చి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని భావిస్తోంది. దాదాపు 1.23 లక్షల రెండు పడక గదుల ఇళ్లు ఇంకా లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంది. వాటిని భవిష్యత్తులో ఇందిరమ్మ పథకం కింద దరఖాస్తు చేసిన పేదలకు కేటాయించే దిశగా అడుగులు పడుతున్నాయి.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివిధ పథకాల లబ్ధి కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. దాదాపు కోటికిపైగా దరఖాస్తులు రాగా, వాటిల్లో ఇళ్లకు సంబంధించే 15 లక్షలకుపైగా వచ్చి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే పూర్తయినవి కొన్ని, వివిధ దశల్లో ఉన్నవి కొన్ని, ప్రారంభించాల్సినవి కొన్ని.. ఇలా 1.23 లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉన్నాయనేది అధికారుల లెక్క. వాటిని ఆయా ప్రాంతాల లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది.

బీఆర్ఎస్ పూర్తి చేసిన ఇళ్లు 1.53 లక్షలు..

పేదలకు దేశంలో ఎక్కడా లేని తరహాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఉచితంగా అందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదిస్తూ రెండు పడక గదుల ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ పథకం కింద 2.90 లక్షల ఇళ్లను నిర్మించాలని నిర్ణయించగా, 2.28 లక్షల ఇళ్లకు టెండర్లు ఖరారు అయ్యాయి. వాటిల్లో 1.53 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. వీటిల్లో నుంచి నగరం, శివారు ప్రాంతాల్లో 66 వేల ఇళ్లను, ఇతర జిల్లాల్లో మరో 40 వేల ఇళ్లను మొత్తంగా లక్షా 6వేల ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇంకా 47వేల ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఎవరికీ పంపిణీ చేయలేదు. ఇక నిర్మాణాలు పూర్తి చేసుకునే దిశలో మరో 40 వేల ఇళ్లున్నాయనీ, కాంట్రాక్టర్లతో అగ్రిమెంటు పూర్తి అయి, పనులు మొదలుపెట్టిన ఇళ్లు మరో 36 వేల వరకు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఈ 1.23లక్షల ఇళ్లను ఇప్పుడు ఇందిరమ్మ పథకంలోకి మార్చి, తాజాగా అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పంపిణీ చేయాలన్న దిశలో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుస్తోంది.

ఇంకా రూ.నాలుగున్నర వేల కోట్లు కావాలి

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల యూనిట్ కాస్ట్ 5.40 లక్షల మేర ఉన్నందున ఈ ఇళ్ల నిర్మాణానికి భారీగా ఖర్చు అవుతోంది. ఇప్పుడు వివిధ స్థాయిలో నిలిచి ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు ఇంకా రూ.4500 కోట్లు అవసరమని గృహనిర్మాణ మండలి అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. ఇందిరమ్మ పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్లతో పోలిస్తే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ వ్యయం కొంత ఎక్కువే అయినా, ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం భారీగా ఖర్చు చేసి ఉన్నందున మిగతా అసంపూర్తి ఇళ్లను కూడా పూర్తి చేయాల్సి ఉంది. ఇక కొత్తగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించే వీలు లేనందున ఉన్నవాటిని పూర్తి చేసి వాటిని వదిలించుకోవాలని భావిస్తోంది. ఆ ఇళ్లను పూర్తి చేస్తే వాటికి మంచి డిమాండే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అనుసరించిన విధానం ద్వారా ఈ ఇళ్లను కూడా కేటాయించాలని యోచిస్తున్నారు.

జిల్లా వార్తలు

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.26, 785




కిన్నెరసాని డ్యామ్ వద్ద పర్యాటకులు

పాల్వంచరూరల్ : పాల్వంచ మండలం కిన్నెరసానిలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 395 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.14,275 ఆదాయం లభించగా, 220మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.12,510 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

అంజన్న నుంచి రామయ్యకు గోటి తలంబ్రాలు

జంగారెడ్డిగూడెంలో క్రతువును ప్రారంభించిన రామాలయ ఈఓ



ఈఓ రమాదేవికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో నిర్వహించే రామయ్య కల్యాణంలో వినియోగించే గోటి తలంబ్రాలను ప్రతి ఏటా ఏపీలోని జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి పంపడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో గోటి తలంబ్రాలను ఒలిచే ప్రక్రియను భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆంజనేయ ఆలయం అర్చకులు, అధికారులు ఈఓకు ఘనంగా స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

అథ్లెటిక్స్ మీట్ విజయవంతం

- రాష్ట్ర వ్యాప్తంగా 180 మంది అథ్లెట్ల హాజరు
- ఉత్సాహంగా సాగిన పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్లు



100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న అథ్లెట్లు

ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం విజయవంతంగా సాగాయి. పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పురుషులు, మహిళలు కలిపి 180 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. వారిలో 30 నుంచి 85 ఏళ్ల మధ్య వయసు గల అథ్లెట్లు ఉండడం గమనార్హం. మలి వయసులోనూ తమదే విజయం అంటూ వెటరన్ క్రీడాకారులు ఉద్వేగంగా.. ఉత్సాహంగా పరుగులు తీశారు. వెటరన్‌లు ప్రాతినిధ్యం వహించిన ప్రతి ఈవెంట్‌లో తమకు తిరుగులేదనే ఉత్సాహంతో ముందుకు సాగారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కార్పొరేటర్లు చావా మాధురి నారాయణ, కమర్తపు మురళి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 80 ఏళ్ల వయసులోనూ ఉత్సాహంగా పరుగెత్తడం క్రీడా స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. జాతీయ స్థాయిలో కూడా రాణించి రాష్ట్రానికి పతకాలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మేజర్ పి.నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, జిల్లా మాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి నున్నా రాధాకృష్ణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.రవికుమార్, సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, ఎం.డీ.షఫీక్ అహ్మద్, సుధాకర్, వెంకటేశ్వర్లు, రవి, కృష్ణయ్య, పాముల శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, వివిధ జిల్లాల నుంచి హాజరైన మాస్టర్స్ అథ్లెట్స్‌ను 'సాక్షి' పలకరించింది. అవి వారి మాటల్లోనే..



పోటీల ప్రారంభోత్సవంలో అథ్లెట్లు..

గాయమైనా ఇంటి దగ్గర ఉండలే



కాలుకు గాయమైంది. అయినా ఇంటి దగ్గర ఉండబుద్ధి కాలేదు. రాష్ట్రస్థాయి టోర్నీ ఖమ్మంలో జరుగుతుండటంతో పాల్గొనేందుకు వచ్చా. అవకాశం ఇస్తే కచ్చితంగా జాతీయ పోటీలకు ఎంపిక అవుతాననే ధీమా ఉంది.

– ఎం.దుర్గా, జాతీయ మాస్టర్ అథ్లెట్, ఖమ్మం

పోటీపడే సత్తా ఉంది



నాకు ఇంకా పోటీల్లో పాల్గొనే సత్తా ఉంది. 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచా. మరో రెండు ఈవెంట్లలోనూ సత్తా చాటుతా. జాతీయ పోటీలకు ఎంపిక కావడమే లక్ష్యం. అక్కడ కూడా పతకం సాధిస్తాననే నమ్మకం ఉంది.

– ఎం.నాగభూషణం, రిటైర్డ్ పీఈటీ, ఖమ్మం

పతకం తేవడమే లక్ష్యం



నేను ఫుట్‌బాల్ క్రీడాకారుడిని నిత్యం వ్యాయామం చేస్తున్నా. 65 ఏళ్ల వయసులో ఉన్నప్పటికీ జాతీయ పోటీల్లో 100, 200 మీటర్లలో బెస్ట్ టైమింగ్ చేసి రాష్ట్రానికి పతకం తీసుకురావడమే ఆశయంగా పెట్టుకున్నా. ప్రతిరోజూ 3గంటలు ప్రాక్టీస్ చేస్తున్నా.

– సుధాకర్ రాజు, రిటైర్డ్ పీఈటీ, భద్రాద్రి కొత్తగూడెం

ప్రాక్టీసే నా విజయానికి కారణం



రోజూ ప్రాక్టీస్ చేయడం వల్లే రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచా. ఇదే స్ఫూర్తితో జాతీయ టోర్నీలో పాల్గొనేందుకు బాగా ప్రాక్టీస్ చేస్తున్నా. రాష్ట్రస్థాయి పోటీలు బాగానే నిర్వహించారు. మంచి ఏర్పాట్లు చేశారు. ఇలాంటి టోర్నీల్లో ప్రతిభ నిరూపించుకునే అవకాశాలుంటాయనే ఇక్కడి వచ్చా.

– వి.శకుంతల, ఆసిఫాబాద్

మొదటిసారి పాల్గొంటున్నా



మొదటిసారి మాస్టర్స్ అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొంటున్నా. ఇక్కడ అన్ని ఈవెంట్లకు పోటీలు నిర్వహించడంతో ఏది చేయాలో అర్థం కావడం లేదు. కానీ కచ్చితంగా జాతీయ పోటీలకు వరకు వెళ్లాలని ఉంది. యోగా చేయడం వల్లే రన్నింగ్ చేయగలుగుతున్నా.

– రాయల మాధవీలత, ఖమ్మం

100 మందికి పైగా ఎంపికవుతారు



ఏటా 100 మందికి పైగా జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొంటారు. ఈసారి కూడా పైవిధంగా ఎంపిక చేస్తాం. నేను కూడా షాట్‌పుట్‌లో ప్రథమస్థానంలో నిలిచా. ఈసారి అంతర్జాతీయ పోటీలపై దృష్టి పెట్టా. ఈ పోటీలు విజయవంతం కావడంతో మరోసారి నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

–నున్నా రాధాకృష్ణ, అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి

బ్యాటింగ్ చేసి.. ఉత్సాహపరిచి!

- సింగరేణి అధికారులతో కలిసి క్రికెట్ ఆడిన సీఎండీ
- ఫ్రెండ్లీ మ్యాచ్‌లో విజయం సాధించిన బలరామ్ జట్టు



బ్యాటింగ్ చేస్తున్న సింగరేణి సీఎండీ బలరామ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఎండీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని 11 ఏరియాల్లో గల అధికారులు, డైరెక్టర్లతో కలిసి నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆదివారం కొత్తగూడెంలోని ప్రొఫెసర్ జయశంకర్ మైదానంలో ఉత్సాహభరితంగా సాగింది. ఒక జట్టుకు సీఎండీ బలరామ్ కెప్టెన్‌గా వ్యవహరించగా, మరో జట్టుకు డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్.వి.కె.శ్రీనివాస్ సారథ్యం వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన డైరెక్టర్ టీమ్ నిర్ణీత 10 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 57 పరుగులు చేసింది. ఆ తర్వాత రంగంలోకి దిగిన సీఎండీ టీమ్ మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. దీంతో బలరామ్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని అన్నారు. సింగరేణి సంస్థ క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని చెప్పారు. కార్మికులకు ఏరియా, రీజియన్, కంపెనీ, కోలిండియా స్థాయిల్లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ (పీఅండ్‌పీ) జి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బలగం' ఎంతో గుర్తింపునిచ్చింది



రాజీవ్ సిద్ధార్థ కుటుంబసభ్యులతో సత్యనారాయణ

కూసుమంచి : బలగం సినిమాలో తన పాత్రకు ఎంతో గుర్తింపు వచ్చిందని ఏలేశ్వరం సత్యనారాయణ (మటన్ ముక్క రాజయ్య) అన్నారు. ఆదివారం కూసుమంచికి చెందిన వర్ధమాన నటుడు రాజీవ్ సిద్ధార్థ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. తాను ఎన్నో సినిమాలు, వెబ్ సీరియళ్లలో నటించినప్పటికీ బలగం సినిమాలో మటన్ ముక్క రాజయ్య పాత్ర తనకు గుర్తింపు తీసుకొచ్చిందని చెప్పారు. కథాబలం ఉంటే చిన్న చిత్రాలు కూడా అద్భుతంగా విజయాన్ని సాధిస్తాయని బలగం నిరూపించిందన్నారు.

నెహ్రూకప్ విజేత భద్రాచలం

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న నెహ్రూ కప్ క్రికెట్ అంతర్రాష్ట్ర ఫైనల్ పోటీలో భద్రాచలం జట్టు విజేతగా నిలిచింది. బెస్ట్ క్రికెట్ అకాడమీ భద్రాచలం, మాస్టర్స్ లెవెన్ ఖమ్మం జట్ల మధ్య ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన భద్రాచలం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. అనంతరం 167 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఖమ్మం జట్టు పూర్తి ఓవర్లు ఆడి ఏడు వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసి ఓడిపోయింది. భద్రాచలం జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన జట్టు సభ్యుడు తేజకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

విజేత జట్టుతో పాటు రన్నరప్ జట్టుకు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ట్రోఫీతో పాటు నగదు బహుమతిని అందజేశారు. పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వి.వరలక్ష్మి, పాకాలపాటి దుర్గాప్రసాద్, నాగార్జున, సలీమ్, సదానందం, అజీమ్, శ్రీనివాసరావు, బాలమురళీకృష్ణ, తిరుమల్‌రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.